ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
బుధవారం 15 మే 2024

మరణించిన కుమార్తెకు ఓణీల పండుగ

కళ్ల ముందు లేని కూతురి కటౌట్‌కు వేడుక



ప్యారీస్, మే 14: అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ విధి విక్రీంచడంతో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది.. అయినా ఆ దంపతులు ఆ బిడ్డ జ్ఞాపకాలను మరువలేకపోయారు. అందుకే తమ బిడ్డకు ఓణీల కార్యక్రమం కూడా నిర్వహించి, ఆమె స్మృతిలో మైమరిచి పోయారు. శివగంగ జిల్లాలో జరిగిన ఈ కార్యక్రమానికి సంబంధించి వివరాలిలా... త్రిభువనం ప్రాంతానికి చెందిన బాలకృష్ణన్, రాకు దంపతుల కుమార్తె పాండిచ్చల్‌ను అల్లారుముద్దుగా పెంచుకున్నారు. చిన్నతనం నుంచే నగలన్నా, పూవులన్నా ఇతర అలంకారం చేసుకోవాలన్నా పాండిచ్చల్‌కు అమిత ఇష్టం. తల్లితో పాటు శుభ కార్యక్రమాలకు వెళ్లే సమయంలో చక్కగా అలంకరించుకొని అందర్నీ ఆకట్టుకునేది. మూడేళ్ల క్రితం అనారోగ్యం కారణంగా పాండిచ్చల్ మరణించడంతో తల్లిదండ్రులు, బంధువులు జీర్ణించుకోలేకపోయారు. భౌతికంగా కుమార్తె తమతో లేకపోయినప్పటికీ ఉన్నట్లు భావించి ప్రతి ఏటా పుట్టినరోజు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మరణించిన కుమార్తెకు ప్రస్తుతం 11 ఏళ్లు కావడంతో ఆమె ఉన్నట్లే భావించిన తల్లిదండ్రులు ఆమె ఆకారంతో రూపొందించిన కటౌట్‌కు ఓణీల ఫంక్షన్ జరపాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆహ్వానపత్రికలు ముద్రించి తమకు తెలిసిన బంధువులకు, మిత్రులకు పంచిపెట్టారు. సోమవారం త్రిభువనం ప్రాంతంలోని ఓ కల్యాణ మండపంలో వేదికపై పాండిచ్చల్ కటౌట్‌కు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు తొడిగి మెడలో పూలదండ వేసి ఓణీల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా కటౌట్ ముందు నిలబడి ఉత్సాహంగా సెల్ఫీలు కూడా తీసుకున్నారు.

వైభవంగా గుడియాత్తం గంగమ్మ శిరస్సు వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపు

వేలూరు, మే 14: జిల్లాలో ప్రసిద్ధిచెందిన గుడియాత్తం గంగమ్మ శిరస్సు వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి కాపు కట్టి వివాహ కార్యక్రమం జరిగింది. తెల్లవారు జామున ముత్యాలమ్మ ఆలయం నుంచి అమ్మవారి శిరస్సును అలంకరించి, పుట్టింటి నుంచి ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయం నుంచి అమ్మవారి శిరస్సు మేళతాళాల ఊరేగింపు, భక్తుల దివ్య నామస్మరణల నడుమ గోపాలపురంలోని గంగమ్మ ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారి శరీరంపై ఉంచారు. అనంతరం శరీరంపై ఉన్న శిరస్సును కిందకు దించి ప్రధాన వీధుల మీదుగా సున్నాంబుపేట వరకు ఊరేగించారు. ఈ వేడుకల సందర్భంగా జిల్లాలో సెలవు ప్రకటించారు. ఈ వేడుకలను జిల్లాలోని పలు ప్రాంతాలు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన సుమారు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులు పిండి దీపాలతో అమ్మవారి శిరస్సు ఊరేగింపులో దారిపొడవునా స్వాగతించారు. కొందరు భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, శిరస్సుపై పూలగరగాలు ఎత్తి తమ మొక్కులు నెరవేర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్ జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 1,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.. వేడుకల్లో ఎంపీ కదిర్ ఆనంద్, గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు, పార్టీ నేతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఒకే టిక్కెట్‌తో ప్రయాణం



- ఎంటీసీ బస్సులు, సబర్బన్, మెట్రోరైళ్లలో అనుమతి
- త్వరలో అమలులోకి వచ్చే అవకాశం

పెరంబూర్, మే 14: నగరంలో నడుస్తున్న ఎంటీసీ బస్సులు, సబర్బన్, మెట్రోరైళ్లలో ఒకే టిక్కెట్టు మీద ప్రయాణించే సౌకర్యం అందుబాటులోకి రానుంది. నగరం, శివారు ప్రాంతాలకు మెట్రోపాలిటన్ కార్పొరేషన్ (ఎంటీసీ) సాధారణ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, ఏసీ బస్సులు, దక్షిణ రైల్వే సబర్బన్ రైళ్లను నడుపుతోంది. నగర జనాభా పెరుగుతుండడంతో వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. ఈ సమస్య పరిష్కరించేలా మెట్రోరైలు ప్రాజెక్ట్ అమలుకు తీసుకొచ్చారు. మొదటి విడతలో వింకో నగర్-విమానాశ్రయం, సెంట్రల్-రైల్వేస్టేషన్-సెయింట్ థామస్ మౌంట్ మధ్య మెట్రోరైళ్లు అందుబాటులో ఉన్నాయి.

ఒకే టిక్కెట్టు...

ఎంటీసీ బస్సులు, సబర్బన్ రైళ్లు, మెట్రోరైళ్లలో ప్రయాణించాలంటే వేర్వేరు టిక్కెట్లు కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ మూడింటిలోనూ ఒకే టిక్కెట్టుపై ప్రయాణించే సౌకర్యం తేవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపకల్పనకు చెన్నై ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. ఈ ప్రక్రియ ముగిసి జూలై రెండో వారం నుంచి ఈ విధానం అమలుకు రానుంది. ఇందుకోసం ప్రత్యేక కార్డు రూపొందించడంతో పాటు దానిని రీచార్జి చేసుకొనే సదుపాయం కల్పించనున్నారు. ఈ కార్డు వినియోగించి ఎంటీసీ బస్సులు, సబర్బన్, మెట్రోరైళ్లలో ప్రజలు ప్రయాణించవచ్చని అధికారులు తెలిపారు.

ఎగ్మూర్ కోర్టుకు హాజరైన ఈపీఎస్



కోర్టులు హాజరైన పళనిస్వామి

పెరంబూర్, మే 14: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మంగళం ఎగ్మూర్ కోర్టుకు హాజరయ్యారు. పురుషవాక్కంలో గత నెల 15వ తేది నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఈపీఎస్ మాట్లాడుతూ.. 'మనకు పోటీగా డీఎంకే తరఫున నిలబడిన వ్యక్తి (దయానిధి మారన్) తన స్వలాభం కోసం పోటీచేస్తున్నారు. ఆయన, తన ఎంపీ నియోజకవర్గం నిధులు సుమారు 75 శాతం ఖర్చుచేయలేదు' అని ఆరోపించారు. ఈపీఎస్ వ్యాఖ్యలపై దయానిధి మారన్ పరువు నష్టం కేసు దాఖలుచేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఈపీఎస్ ఆరోపణలు చేశారని, ఆయన వ్యాఖ్యల తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగించేవిగా ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఈ కేసుకు సంబంధించి పళనిస్వామ మంగళవారం ఉదయం ఎగ్మూర్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఈ కేసు విచారణ జూన్ 27వ తేదీకి వాయిదాపడింది.

రాష్ట్రంలో 41 మంది న్యాయమూర్తుల బదిలీ

ప్యారీస్, మే 14: రాష్ట్రంలో41 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు చీఫ్ రిజిస్ట్రార్ ఎం.జ్యోతిరామన్ ఉత్తర్వులు జారీచేశారు. చెన్నై కుటుంబ సంక్షేమ కోర్టు అడిషినల్ ప్రిన్సిపల్ న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఎండీ సుమతి పుదుచ్చేరి పోక్సో కోర్టు న్యాయమూర్తిగా, చెన్నై రవాణా శాఖ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా ఉన్న మరియాగ్లైడ్ చెన్నై పరిశ్రమల ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా, అక్కడ పనిచేసిన దీప్తి అరివినిధి చెన్నై వాణిజ్య సంస్థల కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అదే విధంగా తిరువళ్లూర్, కోయంబత్తూర్, తిరువారూర్ జిల్లాలకు చెందిన న్యాయమూర్తులను ఇతర కోర్టులకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

భవన నిర్మాణ కార్మికులకు రోజూ 6 గంటల విశ్రాంతి



చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్నినక్షత్రం ఎండలు తీవ్రరూపం దాల్చడం, వడగాడ్పులు వీస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల పనిగంటలను క్రమబద్ధీకరించింది. ఆ మేరకు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల దాకా వరకు ఆరు గంటల పాటు కట్టడ కార్మికులతో పనులు చేయించకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం రెండు మూడు జిల్లాల్లోనే తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. కానీ ఇతర జిల్లాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి. ఇక చెన్నై సహా పలు జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే అధికంగా ఉంది. దీంతో భవన నిర్మాణ కార్మికులు గతంలా మండుటెండలో పనిచేయలేకపోతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల ఆరోగ్యానికి హాని కలుగకుండా పనిగంటలను సవరించాలని ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ మేరకు పరిశ్రమల భద్రత ఆరోగ్యశాఖ డైరెక్టర్ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా పగటిపూట ఉష్ణోగ్రత అధికంగా ఉంటూ వడగాడ్పులు వీస్తుండటంతో కట్టడ కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కట్టడ నిర్మాణ పనులకు దూరంగా ఉంచాలని ఆదేశించారు. ఈ నెలఖారువరకు ఈ నిబంధన తప్పకుండా పాటించాలని, లేకుంటే నిర్మాణ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్నినక్షత్రం ఎండలు ఈ నెల 28న ముగియనుండటంతో అంతవరకూ కట్టడ నిర్మాణ సంస్థలు ఈ నిబంధన పాటించాలని స్పష్టం చేశారు.

వైద్యశాఖ అధికారి ఇంటిపై ఏసీబీ దాడి



- కుటుంబ సంక్షేమ శిక్షణా కాలేజీ ప్రిన్సిపాల్ నివాసంలో సోదాలు
- ఆదాయానికి మించి 61.38 శాతం అక్రమార్జన

అడయార్, మే 14: కాంచీపురం జిల్లా హెల్త్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం నగరంలోని కుటుంబ సంక్షేమ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న పళని (59) నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక సోదాలు చేపట్టారు. ఆదాయానికి మంచి 61.38 శాతం మేర అక్రమార్జన చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో కోట్లాది రూపాయల అక్రమార్జనకు సంబంధించిన కీలక పత్రాలతో పాటు అనేక స్థిరాస్తి కొనుగోలుకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నగర శివారు ప్రాంతమైన నొలంబూరు గురుస్వామి వీధికి చెందిన పళని (59) ఆరోగ్య శాఖలో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేశారు. ఆ తర్వాత ఆయన అంచలంచెలుగా పదోన్నతి పొందుతూ ప్రస్తుతం కాంచీపురం జిల్లా హెల్త్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేయగా, ప్రస్తుతం ఎగ్మోర్‌లోని కుటుంబ సంక్షేమ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. 2021 అక్టోబరు 18న జరిపిన సోదాల్లో రూ.2,02,300 నగదును స్వాధీనం చేసుకోగా, దీనిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఏసీబీ అధికారుల తనిఖీల్లో ఆయన లాకర్ నుంచి రూ.3,22,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆయన భార్య ప్రమీల పేరుపై కూడా అక్రమాస్తులు ఉన్నట్టు గుర్తించారు. ఆ తర్వాత జరిపిన విచారణలో ఆయన ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్టు తేలింది. ఆయన పేరుమీద రూ.2.93 కోట్లు, భార్య పేరుమీద రూ.2.34 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. ఈయన సర్వీస్‌లో ఏకంగా 61.38 శాతం మేరకు అక్రమాస్తులు సంపాదించినట్టు కనుగొన్నారు. దీనికి సంబంధించి ఏసీబీ అధికారులు మంగళవారం మొగప్పేరులోని ఆయన నివాసంలో తనిఖీలు చేసి, నగదు, నగలు, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

సెల్వరాజ్‌కు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల నడుమ ముగిసిన అంత్యక్రియలు



సెల్వరాజ్ భౌతికకాయం ఉన్న పేటికను మోసుకెళుతున్న పార్టీ ప్రముఖులు, గాలిలోకి కాల్పులు జరుపుతున్న సాయుధ దళం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో నగరంలో మృతి చెందిన నాగపట్నం లోక్‌సభ నియోజకవర్గం సీపీఐ సభ్యుడు సెల్వరాజ్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో పార్టీ ప్రముఖులు, మిత్రులు, కుటుంబసభ్యుల అశ్రునయనాల నడుమ జరిగాయి. సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడిగాను, నాగపట్నం ఎంపీగా సేవలందించిన సెల్వరాజ్ అనారోగ్యంతో నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందారు. సోమవారం వేకువజామున చికిత్స ఫలించక మృతి చెందారు. దీంతో సెల్వరాజ్ భౌతికకాయాన్ని ఆయన స్వస్థలమైన తిరువారూరు జిల్లా చిత్తమల్లికి తరలించిన విషయం తెలిసిందే. ఆయన స్వగృహం వద్ద సెల్వరాజ్ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకూ సీపీఐ, సీపీఎం నేతలు, కార్యకర్తలు, డీఎంకే సహా వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు సెల్వరాజ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం నివాళులర్పించేందుకు వందలాది మంది సీపీఐ, సీపీఎం కార్యకర్తలు బారులుదీరారు. అదే సమయంలో అక్కడ ఏర్పాటు చేసిన సంతాప సభలో సీపీఐ జాతీయ కమిటీ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఇరా ముత్తరసన్, డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు తదితర నాయకులు పాల్గొని సెల్వరాజ్‌కు నివాళులర్పించారు. ఆ తర్వాత సెల్వరాజ్ నివాసానికి చేరువుగా ఎంపిక చేసిన ప్రాంతం వద్ద అంత్యక్రియల ఏర్పాట్లు జరిగాయి. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాలతో ప్రభుత్వ లాంఛనాల నడుమ ఈ ఏర్పాట్లు కొనసాగాయి. సెల్వరాజ్ భౌతికకాయాన్ని ఖననం చేస్తుండగా తిరువారూరు ఎస్పీ జయకుమార్ పర్యవేక్షణలో పోలీసు దళాలు గాలిలోకి 21 సార్లు తూటాలు పేల్చారు. పార్టీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో దివంగత కామ్రేడ్ సెల్వరాజ్‌కు అంతిమ వీడ్కోలు పలికారు.

ప్లస్-1 ఫలితాల్లో 91.17% ఉత్తీర్ణత

- 96.02 శాతంతో కోవై జిల్లా ఫస్ట్



చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్లస్-1 పబ్లిక్ పరీక్షలో 91.17 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షలకు 8,11,172 మంది హాజరుకాగా, 7,39,539 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షల్లో కోయంబత్తూరు జిల్లా 96.02 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. 89.41 శాతం ఉత్తీర్ణతతో విల్లుపురం జిల్లా చివరి స్థానం పొందింది. ప్లస్-1 పబ్లిక్ పరీక్షలు మార్చి 4 నుంచి 25 వరకు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా 7.534 పాఠశాలలకు చెందిన 3,89,736 మంది బాలురు, 4,03,471 మంది బాలికలు సహా మొత్తం 8లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరితోపాటు 5వేల మంది ప్రైవేటు అభ్యర్థులు, 187 మంది ఖైదీలు ఈ పరీక్షలు రాశారు. ఈ నేపథ్యంలో ప్లస్-1 ఫలితాలను మంగళవారం ఉదయం 9.30 గంటలకు నుంగంబాక్కం ప్రొఫెసర్ అన్బళగన్ విద్యామండలిలో ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో డైరెక్టర్ సేతురామ వర్మ విడుదల చేశారు. పాఠశాలల వారీగా ఉత్తీర్ణతా శాతాల వివరాలను ప్రకటించారు. ఆ మేరకు ప్రభుత్వ పాఠశాల్లో 85.75 శాతం, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 92.36 శాతం, ప్రైవేటు స్వయం ప్రతిపత్తి పాఠశాలల్లో 98.09 శాతం. బాలబాలికల పాఠశాలల్లో 91.61 శాతం, బాలికల పాఠశాలల్లో 94.46 శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల్లో 96.02 శాతం ఉత్తీర్ణత సాధించి కోయంబత్తూరు జిల్లా ప్రథమస్థానం దక్కించుకుంది. 95.56 శాతం ఉత్తీర్ణతతో ఈరోడ్ జిల్లా ద్వితీయ స్థానం, 95.23 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానంపొందింది. చెన్నై జిల్లాలో 91.68 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

పాఠ్యాంశాలవారీగా..

పాఠ్యాంశాల వారీగా సైన్స్‌లో 94.31 శాతం, కామర్స్‌లో 86.93 శాతం, ఆర్ట్స్‌లో 72.89 శాతం, సాంకేతిక పాఠ్యాంశంలో 78.72 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక తమిళంలో 8 మంది, ఆంగ్లంలో 13 మంది, భౌతిక శాస్త్రంలో 696 మంది, రసాయనశాస్త్రంలో 493 మంది, బయాలజీలో 171 మంది నూటికి నూరు మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఇదే విధంగా గణితంలో 779 మంది, వృక్షశాస్త్రంలో ఇద్దరు, జంతుశాస్త్రంలో 29 మంది, కంప్యూటర్ సైన్స్‌లో 3432 మంది, కామర్స్‌లో 62మంది, అకౌంటెన్సీలో 415 మంది, ఎకనామిక్స్‌లో 741 మంది, మాథ్స్ స్టాటిటిక్స్‌లో 293 మంది నూటికి నూరు మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.

సమాచార దర్శిని

రేపటి నుంచి సరస్వతి ఆలయంలో వేసవి శిక్షణ

ప్యారీస్, మే 14: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కంలో ఉన్న విద్యారంభ జ్ఞాన మహాసరస్వతి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19వ తేది వరకు ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఏడేళ్ల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థినీ, విద్యార్థులకు తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 7 గంటల వరకు శ్లోకాలు, సంధ్యా వందనం, భజన, ఫన్ క్లబ్, నీతి కథలు, ధ్యానం, యోగ తదితరాలపై అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. మూడు రోజులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, వసతి కల్పిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పీవీ కృష్ణారావు తెలిపారు. వివరాలకు, రిజిస్ట్రేషన్‌కు 9380124747 నెంబరు సంప్రదించవచ్చు.

18న వాసవి మాత విజయం

ప్యారీస్, మే 14: స్థానిక వెస్ట్ మాంబళం కుప్పయ్య శెట్టి వీధిలోని వీకేసీ కల్చరల్ సెంటర్‌లో వాసవి మాత విజయం ఈ నెల 18వ తేది జరుగనుంది. గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర హోమం, ఆయుష్య హోమం, త్రియాంబక హోమం, మృత్యుంజయ హోమాలు అనంతరం వాసవి మాతకు అభిషేకం, అలంకారం జరుగనుంది. ఉదయం 10 నుంచి ముత్తయిదువులు పాల్గొనే దీపాల పూజ, కుంకుమ అష్టోత్తర పూజ, ప్రత్యేక అర్చన, మహాదీపారాధన, ప్రసాద వినియోగం ఉంటుందని వాసవి క్లబ్ మాంబళం, అమ్మవారి ట్రస్ట్ నిర్వాహకులు పీఎల్ కమలనాథన్, డా.సెంథిల్‌కుమార్, కామరాజ్‌లు ఓ ప్రకటనలో తెలిపారు.

ఐఐటీలో యూజీ సైన్స్ కోర్సులో ప్రవేశాలు

ఐసిఎఫ్, మే 14: చెన్నై ఐఐటీలో యూజీ సైన్స్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 26వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇండియా సెమి కండక్టర్ మిషన్ పథకం, ఐఐటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు https://study. iitm.ac.in/es/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

కెమికల్ టెక్నాలజీ కళాశాలలో అడ్మిషన్లు

ఐసిఎఫ్, మే 14: కాలేజ్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఈ నెల 24వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. తరమణిలో ఉన్న ఈ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కెమికల్ ఇంజనీరింగ్, పాలిమర్ టెక్నాలజీ వంటి కోర్సుల్లో చేరేందుకు టెన్త్ ఉత్తీర్ణత, దాని సమాన విద్యార్హత కలిగిన వారు https://www. tnpoly.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర వివరాలకు 9841824107 నెంబరు సంప్రదించాలని ప్రిన్సిపాల్ జానకి తెలిపారు.

లేబర్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ కోర్సులు...

లేబర్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. లేబర్ మేనేజ్‌మెంట్ (బీఏ, ఎంఏ), లేబర్ లా డిప్లొమో కోర్సు, మద్రాసు విశ్వవిద్యాలయం అంగీకారం పొందిన పీజీ డీఎల్ఏ, డీఎల్ఎల్ తదితర కోర్సులకు దరఖాస్తు స్వీకరణ గడువు బుధవారంతో ముగియనుంది. విద్యార్థులు దరఖాస్తు రుసుము రూ.200 చెల్లించాలి. ఇతర వివరాలకు 044-29567 885 నెంబరు సంప్రదించాలి.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఐసిఎఫ్, మే 14: నగరంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 16 నుంచి 29వ తేది వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వాణిజ్య విధివిధానాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తి సంస్థల రిజిస్ట్రేషన్ విధానాలు, ఆన్‌లైన్ మార్కెటింగ్ వంటి వివిధ అంశాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్ల పైబడిన వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 7010143022, 8668102600 అనే నెంబర్లు సంప్రదించాలని అధికారులు తెలిపారు.

31 వరకు వృత్తి లైసెన్స్ రెన్యువల్ గడువు

ఐసిఎఫ్, మే 14: చెన్నై కార్పొరేషన్ ప్రాంతాల్లో వృత్తులు చేపడుతున్న వారు ఈ నెల 31వ తేది వరకు లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. 2024-25 సంవత్సరంలో లైసెన్స్ రెన్యువల్ గడువు ఏప్రిల్ 30తో ముగిసింది. వ్యాపారుల కోరిక మేరకు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

సెంజి కోట ప్రవేశ రుసుము పది రోజుల రద్దు

ప్యారీస్, మే 14: తిరువణ్ణామలై జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సెంజి కోట సందర్శనకు సోమవారం నుంచి ఈ నెల 22వ తేది వరకు ప్రవేశ రుసుము రద్దు చేస్తూ భారత పురావస్తు పరిశోధన శాఖ ఉత్తర్వులు జారీచేసింది. సెంజి కోట ప్రాంగణంలోని అమ్మవారి ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు పదిరోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో తిరువణ్ణామలై, విల్లుపురం సహా పొరుగు జిల్లాలకు చెందిన భక్తులు హాజరుకానున్న దృష్ట్యా కోటలోకి వెళ్లేందుకు విధించిన ప్రవేశ రుసుమును పది రోజుల పాటు రద్దు చేశారు. కమలకన్ని అమ్మవారికి ఉదయం అభిషేకం, అలంకార పూజలు నిర్వహిస్తున్నారు.

21 వరకు ఉన్నత విద్య మార్గదర్శక కార్యక్రమాలు

ఐసిఎఫ్, మే 14: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 'నా కళాశాల స్వప్నం' రెండో విడత ఉన్నత విద్య మార్గదర్శక కార్యక్రమాలు ఈ నెల 21వ తేది వరకు జరుగనున్నాయని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ తెలిపింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పాఠశాలల్లో ప్లస్ టూ చదివిన 91.03 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరు తరువాత చదవాల్సిన ఉన్నత విద్య గురించి తెలియజేసేలా ఈ కార్యక్రమం చేపట్టారు. ఇదివరకే నిర్వహించిన కార్యక్రమంలో 13,800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండో విడత కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కళాశాలల ఎంపిక, రిజిస్ట్రేషన్ విధానం, కావాల్సిన సర్టిఫికేట్ల వివరాలు, ఉపకార వేతనాలు వంటి వాటిని వివరించనున్నారు.

ఎన్ఐఏ అధికారుల రహస్య విచారణ

పెరంబూర్, మే 14: బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడుకు సంబంధించి మళ్లీ నగరంలో ఎన్ఐఏ అధికారులు మకాం వేసి రహస్యంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ కేసులో అరెస్టయిన అబ్దుల్ మదీన్‌తాహా నగరంలో బసచేసిన కారణంగా, ఆయనకు సహాయం చేసిన ఇద్దరిపై ఎన్ఐఏ అధికారులకు సందేహం ఏర్పడింది. వీరిని గాలించేందుకు ఎన్ఐఏ అధికారులు నగరంలో మకాం వేసి రహస్య విచారణ చేపట్టినట్లు వార్తలు వెలువడ్డాయి.

ప్రభుత్వ బస్సులో గొడుగుతో ప్రయాణం...!



వర్షానికి తడవకుండా గొడుగుతో ప్రయాణిస్తున్న మహిళ

పెరంబూర్, మే 14: ప్రభుత్వ బస్సులో వర్షానికి తడవకుండా గొడుగుతో ప్రయాణించారు. అగ్నినక్షత్రం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత అధికంగా ఉండగా, తేని, మదురై, కోయంబత్తూర్, నీలగిరి సహా పలు జిల్లాల్లో వేసవి వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తేని నుంచి మదురైకు టీఎన్ 57ఎన్ 2226 అనే బస్సు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కంభం నుంచి మదురైకి బయల్దేరింది. బస్సులో 30 మంది ప్రయాణిస్తుండగా, సిలయంపట్టి ప్రాంతంలో హఠాత్తుగా భారీవర్షం కురిసింది. బస్సు పైభాగం దెబ్బతినడంతో వర్షపు నీరు లోపలికి వచ్చి సీట్లు, బస్సు అంతా తడిచిపోయింది. ఈ క్రమంలో, ఎండ నుంచి ఉపశమనం కోసం గొడుగులు తెచ్చుకున్న కొందరు ప్రయాణికులు గొడుగులు వేసుకొని వర్షపు నీటికి తడవకుండా ప్రయాణించగా, గొడుగులు లేని వారు మాత్రం తడుస్తూనే ప్రయాణించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ బస్సుల్లో దెబ్బతిన్న విడిభాగాలు గుర్తించి సత్వరం మరమ్మతులు చేపట్టాలని రవాణా శాఖ ఉత్తర్వులు ఆచరణలో అమలుకావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

విదేశాలకు వెళ్లేవారికి ఎల్లోఫీవర్ టీకాలు తప్పనిసరి

● ఆరోగ్యశాఖ ఆదేశం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లేవారికి ఎల్లో ఫీవర్ నిరోధక టీకాలు తప్పనిసరని ఆరోగ్య, రోగనిరోధక శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల్లో ప్రస్తుతం ఎల్లో ఫీవర్ వ్యాపిస్తుండటంతో ఆ రకం జ్వరాలు స్వదేశంలో, రాష్ట్రంలో చొరబడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లేవారికి, అదే విధంగా ఎల్లోఫీవర్ సోకిన విదేశాల నుంచి వచ్చేవారికి ఎల్లోఫీవర్ నిరోధక టీకాలు వేయాలని ఆదేశంలో పేర్కొన్నారు. ఈ టీకా వేసుకున్న పది రోజుల తర్వాతే విదేశాలకు వెళ్ళవచ్చని, అదే విధంగా ఎల్లోఫీవర్ సోకిన దేశాల నుంచి వచ్చేవారు కూడా పది రోజుల ముందు టీకా వేసుకున్నట్లు ధ్రువీకరణ పత్రం ఉంటేనే రాష్ట్రంలో అడుగుపెట్టేందుకు అనుమతిస్తారని తెలిపారు. విమానంలో వచ్చేవారికి, నౌకలో వచ్చేవారికి ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఎల్లోఫీవర్ నిరోధక టీకాలు వేసే కేంద్రాల వివరాలను https:// ihpoe. mohfw.gov.in/index.php అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

21న కావేరి నిర్వాహక మండలి సమావేశం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): కావేరి నిర్వాహక మండలి 30వ సమావేశం ఈ నెల 21న ఢిల్లీలో జరుగనుంది. ఆ మండలి అధ్యక్షుడు ఎస్కే. హల్దా సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. 21 మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో రాష్ట్రంతో పాటు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. మార్చి 30న జరిగిన మండలి సమావేశంలో కావేరి డెల్టా రైతుల సాగుకోసం 2.5 టీఎంసీల నీరు విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసినా అక్కడి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కావేరి జలాల విడుదల విషయమై మలి విడత చర్చలు జరిపేందుకు కావేరి నిర్వాహక మండలి సమావేశం జరుగనుంది.

ఎయిర్‌పోర్ట్‌లో రష్యన్ దంపతుల వద్ద

రూ.25లక్షల స్వాధీనం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాంబాక్కం విమానాశ్రయంలో రష్యన్ దంపతుల నుంచి రూ.25లక్షలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వేకువజామున ఢిల్లీ నుంచి వచ్చిన విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ విమానంలో దిగిన రష్యాకు చెందిన ఆర్దిమీ బీటికోవ్, ఆయన భార్య అన్‌స్టిషియా ఒరోబెవా లగేజీ తనిఖీచేయగా రూ.25లక్షలు లభించింది. వెంటనే ఆ నగదు, రష్యన్ దంపతులను విమానాశ్రయంలో ఐటీ అధికారులకు అప్పగించారు. ఆ నగదుకు ఎలాంటి పత్రాలు, రశీదులు లేకపోవడంతో ఆ నగదును ఢిల్లీ నుంచి చెన్నై ఎందుకు తీసుకువచ్చారంటూ ఐటీ అధికారులు వారిని ప్రశ్నించారు. ఆ రష్యన్ దంపతులు సక్రమంగా సమాధానాలు చెప్పకపోవడంతోవారిని రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి అధికారులు విచారణ ప్రారంభించారు.

ఉద్యోగం పేరిట రూ.16.5లక్షల మోసం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ఉద్యోగం వేయిస్తానంటూ సేలం జిల్లా ఏర్కాడుకు చెందిన అస్‌ప్రిత్ అజయ్ వద్ద రూ.16.5లక్షలు వసూలు చేసిన కార్పొరేషన్ ఉద్యోగిపై తేనాంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అజయ్ అనే విద్యార్థికి స్నేహితుడు కరికాలన్ ద్వారా దినేష్ అనే కార్పొరేషన్ ఉద్యోగి పరిచయం అయ్యాడు. కార్పొరేషన్‌లో తనకు పలుకుబడి ఉందని ఉద్యోగం ఇప్పిస్తానని తెలిపారు. అతడి మాటలు నమ్మి అజయ్ రూ.16.5 లక్షలు ఇచ్చాడు. రెండేళ్లు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో అజయ్ తేనాంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దినేష్‌ను విచారణ జరపనున్నారు.

ఇద్దరు మహిళా డీఐజీల బదిలీ

ఐసిఎఫ్, మే 14: రాష్ట్ర పోలీసు శాఖలో ఇద్దరు మహిళా డీఐజీలు కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు బదిలీ అయ్యారు. మదురై డీఐజీ రమ్యాభారతి కేంద్ర విమాన భద్రతా విభాగానికి, కాంచీపురం డీఐజీ పొన్ని కేంద్ర వాణిజ్య భద్రతా దళానికి బదిలీ అయ్యారు.

విద్యలో రాణిస్తున్న దివ్యనేత్రులైన కవలలు



హేమతారణి, హిమశ్రీ

పెరంబూర్, మే 14: విద్యా సముపార్జనకు అంధత్వం ఒక అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు కవలలైన బాలికలు. మనలి బల్లి పాళయానికి చెందిన శ్రీనివాసన్-ఢిల్లీరాణి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెలు హేమతారణి, హేమశ్రీలు కవల పిల్లలు. కంటి చూపు లోపం ఉన్న దివ్యాంగులు. వీరిద్దరు తేనాంపేటలోని సిరుమలర్ అంధ విద్యార్థుల పాఠశాలలో ప్లస్ టూ చదివారు. బ్రెయిలీ లిపిలో చదివిన వీరిద్దరు పరీక్షలు రాశారు. అందులో హేమతారణి కంప్యూటర్ సైన్స్‌లో 100కి 100 మార్కులు సాధించింది. తమిళం, జాగ్రఫీ, ఎకనామిక్స్, హిస్టరీలో 99 మార్కులు, ఆంగ్లంలో 73 మార్కులు మొత్తం 569 మార్కులు సాధించి పాఠశాలస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక, హిమశ్రీ కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో 99 మార్కులు, హిస్టరీలో 98, తమిళంలో 92, ఇంగ్లీషులో 79 మార్కులు అని మొత్తం 566 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. గతంలో హిమశ్రీ పదవ తరగతి పరీక్షల్లో 452 మార్కులు సాధించి పాఠశాలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే, హేమతారణి పదవ తరగతి పరీక్షల్లో 449 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. విద్యాపరంగా గొప్ప విజయాలు సాధించిన ఈ కవల సోదరీమణులు ఇద్దరూ భవిష్యత్తులో బీఏ ఇంగ్లీషు చదివి ఐఎఫ్ఎస్ అధికారులు కావాలని ఆకాంక్షిస్తున్నారు.

18న ఎస్కేపీడీలో వాసవి జయంత్యుత్సవం

● నేటి నుంచి లక్షార్చన ప్రారంభం

ప్యారీస్, మే 14: స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో ఈ నెల 18న వాసవి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ట్రస్టీలు ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 8.30 నుంచి 9.30 గంటలకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు రెండు విడతలుగా వాసవి లక్షార్చనలో మహిళలు పాల్గొననున్నారు. వాసవి జయంతి సందర్భంగా అమ్మవారి జన్మస్థలమైన పెనుగొండ క్షేత్రం నుంచి ప్రత్యేక పూజల అనంతరం బయల్దేరే వాసవి జ్యోతి జైత్రయాత్ర పాలకొల్లు, ఏలూరు, విజయవాడ, కొత్తపట్నం, ఒంగోలు, నెల్లూరు, నాయుడుపేట మీదుగా ఈ నెల 18వ తేది ఉదయం 6 గంటలకు నగరానికి చేరుకుంటుంది. చెట్‌పెట్‌లోని ఎస్కేపీడీ హాస్టల్ ప్రాంగణం నుంచి బయల్దేరే జ్యోతియాత్ర ఉదయం 8.30 గంటలకు ఎస్కేపీడీ దేవస్థానం చేరుకుంటుంది. భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులుకావాలని ట్రస్టీలు పిలుపునిచ్చారు.

ఇంజనీరింగ్ కోర్సులకు 1.16 లక్షల మంది దరఖాస్తు

పెరంబూర్, మే 14: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 8 రోజుల్లో 1.16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్లస్ టూ ఫలితాలు విడుదలైన ఈ నెల6వ తేది నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఆ ప్రకారం, తొలిరోజే సుమారు 20,000 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ ప్రకారం, సోమవారం వరకు 1,16,572 మంది దరఖాస్తు చేశారు. వారిలో 68,245 మంది దరఖాస్తు రుసుము చెల్లించగా, 36,624 మంది సర్టిఫికెట్లు అప్‌లోడ్‌చేశారు. కాగా, దరఖాస్తు సమర్పణకు చివరి తేది జూన్ 6వ తేది అని అధికారులు తెలిపారు.

సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, మే 14: స్థానిక పార్క్ రైల్వేస్టేషన్‌లో మరమ్మతుల కారణంగా చెన్నై బీచ్-తాంబరం మధ్య అర్ధరాత్రి 12.10 నుంచి తెల్లవారుజామున 4.30 గంటల వరకు సబర్బన్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- చెన్నై బీచ్ నుంచి తాంబరంకు రాత్రి 9.30, తెల్లవారుజామున 4.15 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు ఈ నెల 14.15,16,17 తేదీల్లో రద్దు.
- తాంబరం నుంచి చెన్నై బీచ్‌కు రాత్రి 11.40, తెల్లవారుజామున 4.15 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు ఈ నెల 15,16,17,18 తేదీల్లో రద్దు...

పాక్షిక రద్దు...

- చెంగల్పట్టు నుంచి రాత్రి 11 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే సబర్బన్ రైలు ఈ నెల 14,15,16,17 తేదీల్లో చెన్నై బీచ్‌కు బదులుగా చెన్నై ఎగ్మూర్ వరకు మాత్రమే నడుస్తుంది.
- చెన్నై బీచ్ నుంచి తెల్లవారుజామున 3.55 గంటలకు చెంగల్పట్టుకు బయల్దేరే సబర్బన్ రైలు ఈ నెల 15,16,17,18 తేదీల్లో చెన్నై బీచ్‌కు బదులుగా చెన్నై ఎగ్మూర్ నుంచి బయల్దేరుతుంది.

మహిళలకు వ్యతిరేకంగా అసభ్యకర వ్యాఖ్యలు

● బీజేపీ నేత హెచ్.రాజాకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

ప్యారీస్, మే 14: మహిళలకు వ్యతిరేకంగా అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజాకు వ్యతిరేకంగా దాఖలైన కేసు రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. 2018వ సంవత్సరం హెచ్.రాజాపై మాజీ మంత్రి అందియూర్ సెల్వరాజ్ సహా డీఎంకే నాయకులు ఈరోడ్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. రాజాపై నమోదైన కేసు ఈరోడ్ జిల్లా న్యాయస్థానంలో విచారణలో ఉండగా, చెన్నై ప్రత్యేక కోర్టుకు బదిలీ అయింది. దీంతో తనకు వ్యతిరేకంగా దాఖలైన కేసు రద్దు చేయాలని కోరుతూ రాజా దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు, విచారణ త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కేసుల విచారణ జరుపుతున్న ప్రత్యేక కోర్టుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, తనపై దాఖలైన కేసులు రద్దు చేయాలని కోరుతూ రాజా తరఫున దాఖలైన అప్పీలు పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

అన్నాడీఎంకేపై మంత్రి రఘుపతి విషం కక్కుతున్నారు

● మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్

ప్యారీస్, మే 14: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి అన్నాడీఎంకేపై విషం కక్కుతున్నారని మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ మండిపడ్డారు. మదురైలో మంగళవారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆర్బీ ఉదయకుమార్ ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడడంలో ముందున్న అన్నాడీఎంకేకు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుండడం చూసి ఓర్వలేక మంత్రి రఘుపతి అన్నాడీఎంకే గురించి రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం అన్నాడీఎంకేలో చీలికలు ఏర్పడతాయని మంత్రి సోమవారం మాట్లాడారని, ఆయన అన్నాడీఎంకేలో ఉన్న సమయంలో పార్టీ కల్పించిన పదవుల్లో కొనసాగి లబ్ధిపొందారని ఆరోపించారు. పార్టీకి వెన్నుపోటు పొడిచి డీఎంకేలో చేరి మంత్రి అయ్యాక రఘుపతి ఆపదలో తనకు ఆదుకున్న అన్నాడీఎంకే గురించి ఇష్టమొచ్చినట్లు విమర్శించడం ఖండించదగ్గదన్నారు.

మత్తు మాత్రలు, గంజాయి విక్రయించిన ఇద్దరి అరెస్టు

అడయార్, మే 14: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో మత్తు మాత్రలు, గంజాయి విక్రయించిన ఇద్దరు వ్యక్తులను నగర పోలీసులు అరెస్టు చేశారు. కోయంబేడు మార్కెట్ పరిసర ప్రాంతాల్లో మత్తు మాత్రల విక్రయం జోరుగా జరుగుతుందని పోలీసులకు సమాచారం రావడంతో ఆ ప్రాంతంలో పోలీసులు మఫ్టీలో నిఘా పెట్టి, అనుమానాస్పదంగా తిరుగున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. తనిఖీల్లో పది షీట్ల డ్రగ్ మాత్రలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యక్తిని విల్లుపురం ప్రాంతానికి చెందిన దయాళన్‌గా గుర్తించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అదేవిధంగా, స్థానిక ఒట్టేరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రయోగి సమాధి వీధిలో గంజాయి విక్రయిస్తున్న పులియంతోపు శాస్త్రినగర్ 19వ వీధికి చెందిన సాల్మాన్‌ను అరెస్టు చేశారు. వీరిద్దరిపై వేర్వేరు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బస్సు, లారీ ఢీ : పది మందికి గాయాలు

అడయార్, మే 14: తేని జిల్లా ఉత్తమపాళెయం తాలూకా మేల్‌మలయనూర్‌లో లారీ, బస్సు ఢీకొన్న ప్రమాదంలో పది మంది గాయపడ్డారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు... ఉత్తమపాళెయంకు చెందిన నాగరాజన్ (50) అనే వ్యక్తి తేని జిల్లా నుంచి ద్రాక్షరసం లోడుతో సోమవారం రాత్రి వస్తుండగా, విల్లుపురం వైపు వస్తున్న ఒక ప్రైవేటు బస్సు లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 10 మంది వరకు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

బ్యాంక్ దోపిడీ ఎలా చేయాలి...?

● యూట్యూబ్ చూస్తూ చోరీకి యత్నం



లెనిన్

పెరంబూర్, మే 14: యూట్యూబ్ చూస్తూ బ్యాంక్‌లో చోరీకి యత్నించిన ఎంబీఏ పట్టభద్రుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయమై పోలీసుల కథనం మేరకు... మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపం అరియపట్టి గ్రామానికి చెందిన లెనిన్ (30) ఎంబీఏ పూర్తిచేసి చెన్నైలోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. అక్కడ తక్కువ జీతం ఇస్తున్నారంటూ ఉద్యోగం మానేసిన లెనిన్ స్వగ్రామానికి వెళ్లాడు. అనంతరం ఆన్‌లైన్ జూదం ఆడి రూ.5 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. పోయిన నగదు సంపాదించడం ఎలా అని లెనిన్ పలు రకాలుగా ఆలోచించాడు. ఈ క్రమంలో, యూట్యూబ్‌లో బ్యాంక్‌లో దొంగతనం ఎలా చేయాలి, అందుకు వినియోగించాల్సిన పరికరాలు తదితర వీడియోలు చూశాడు. దోపిడీకి అవసరమైన పరికరాలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశాడు. అనంతరం ఉసిలంపట్టిలోని ఓ ఫైనాన్స్ సంస్థలో దోపిడీ చేసేందుకు సంస్థ తలుపులు బద్దలుకొట్టాడు. ఆ సమయంలో అటువైపు గస్తీ కి వెళ్లిన ఉసిలంపట్టి స్పెషల్ ఎస్ఐ శాంతి, కానిస్టేబుల్ అన్బుకుమార్‌లను చూసిన లెనిన్ పరారయ్యాడు. కార్యాలయంలో ప్రాంగణంలో ఉన్న మోటార్ బైక్ పరిశీలించగా, అందులో దొంగతనానికి అవసరమైన పరికరాలు గుర్తించారు. అనంతరం ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా లెనిన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

యూట్యూబర్ ఫెలిక్స్ ఇల్లు, ఆఫీసుల్లో సోదాలు

● కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న తిరుచ్చి పోలీసులు

అడయార్, మే 14: రెడ్‌ఫిక్స్ యూట్యూబ్ చానెల్ వ్యవస్థాపకుడు ఫిలిక్స్ జెరాల్డ్ నివాసం, కార్యాలయంలో తిరుచ్చి పోలీసులు మంగళవారం తనిఖీలు చేసి, కీలకమైన డిజిటల్ ఆధారాలను సేకరించారు. తమిళనాడు పోలీస్ శాఖలో పనిచేసే మహిళా పోలీసుల గురించి రెడ్‌ఫిక్స్ యూట్యూబ్‌లో సవుక్కు శంకర్ నోటికొచ్చినట్టుగా అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఈయన మాటలను ఆ యూట్యూబ్ వ్యవస్థాపకుడిగా ఉన్న ఫెలిక్స్ జెరాల్డ్ మరింతగా ప్రోత్సహించేలా ప్రశ్నలు సంధించారు. ఈ వీడియో వైరల్ కావడంతో మహిళా పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు యూట్యూబర్లపై కొందరు మహిళా పోలీసుల ఫిర్యాదు మేరకు తిరుచ్చి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సవుక్కు శంకర్‌ను ఈ నెల 8వ తేదీన అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈయనపై గూండా చట్టం ప్రయోగించారు. అదేవిధంగా ఫెలిక్స్ జెరాల్డ్‌ను ఈ నెల 11న అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో నుంగంబాక్కంలోని కామ్‌ధర్ నగర్‌లో ఉన్న ఆయన నివాసం, జెమిని వంతెన కూడలిలో వద్ద ఉన్న పార్సన్ కాంప్లెక్స్ లో ఉన్న రెడ్‌ఫిక్స్ కార్యాలయాల్లో తిరుచ్చి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కీలకమైన దస్తావేజులతో పాటు డిజిటల్ ఆధారాలను సేకరించారు. కాగా, సవుక్కు శంకర్, ఫెలిక్స్ జెరాల్డ్ అరెస్టు ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

వ్యక్తిగత కార్యదర్శి తండ్రి మృతి

● స్వయంగా వెళ్ళి పరామర్శించిన సీఎం

అడయార్, మే 14: ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యక్తిగత కార్యదర్శి దినేష్ కుమార్ తండ్రి మృతి చెందారు. దీంతో ఆయనను పరామర్శించేందుకు సీఎం స్టాలిన్ సేలం వెళ్ళారు. దినేష్ కుమార్ తల్లిదండ్రులు నామక్కల్ జిల్లా రాశిపురం సమీపంలోని వన్నందూరులో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో దినేష్ కుమార్ తండ్రి రవి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి మంత్రి కేఎన్ నెహ్రూ తదితరులు వెళ్ళి నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో దినేష్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించినందుకు సీఎం స్టాలిన్ మంగళవారం ఉదయం చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో సేలం వెళ్ళారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో వన్నందూరుకు వెళ్ళి దినేష్ కుమార్‌ను పరామర్శి ఓదార్చారు. సాయంత్రానికి మళ్ళీ చెన్నై చేరుకున్నారు.

వారసత్వ ధ్రువపత్రం వ్యవహారం...

రెవెన్యూ శాఖకు హైకోర్టు ఉత్తర్వులు

ఐసిఎఫ్, మే 14: వారసత్వ ధృవీకరణ పత్రాల వ్యవహారంపై ఐదు వారాల్లో నివేదిక దాఖలు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయంకు చెందిన మారన్నన్ తండ్రి మరణించిన అనంతరం వారసత్వ ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. దీనిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విచారణ చేయగా, మారన్నన్ తండ్రి మారన్న గౌడ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నట్లు తెలిసింది. అయితే వీరి పేరు చేర్చకుండా వారసత్వ ధ్రువపత్రం కోసం మారన్నన్ సమర్పించిన దరఖాస్తును తహసీల్దార్ నిరాకరించారు. దీనిపై మద్రాసు హైకోర్టులో మారన్నన్ వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి ఎస్ఎం సుబ్రమణ్యం విచారణకు స్వీకరించారు. తప్పుడు సమాచారమిచ్చి, వాస్తవాలు మరుగుపరచి వారసత్వం సర్టిఫికెట్ కోరడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కేసులు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తహసీల్దార్లకు, రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. వారసత్వ ధృవీకరణ పత్రాల కోసం ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి ఐదు వారాల్లోపు నివేదిక ఇవ్వాలని న్యాయమూర్తి సుబ్రమణ్యం రెవెన్యూ కమిషనర్‌కు ఆదేశాలు జారీచేశారు.

బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వంకు నోటీసులు

పెరంబూర్, మే 14: దయానిధి మారన్ వేసిన పరువు నష్టం కేసులో బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం జూన్ 6వ తేది హాజరుకావాలని చెన్నై ఎగ్మూర్ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఆ రోజు వినోజ్ పి.సెల్వం తప్పక హాజరుకావాలని న్యాయస్థానం ఉత్తర్వుల్లో ఆదేశించింది. డీఎంకే ఎంపీ, మధ్య చెన్నై లోక్‌సభ డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్ దాఖలుచేసిన పిటిషన్‌లో, ఎంపీ నియోజకవర్గ నిధులను దయానిధి మారన్ సక్రమంగా వినియోగించలేదని వినోజ్ పి.సెల్వం గత నెల 17వ తేది సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తన పేరుప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వినోజ్ పి.సెల్వం వ్యవహరించారని ఎంపీ పిటిషన్‌లో పేర్కొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం



సుబ్బురామన్, లక్ష్మి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మే 14: తిరుకోవిలూర్ సమీపంలో భార్య మృతిచెందడంతో తట్టుకోలేని భర్త కూడా మృతిచెందిన ఘటన అందరినీ కంటతడి పెట్టించింది. కళ్లకుర్చి జిల్లా తిరుకోవిలూర్ సమీపం తిమ్మచూర్ గ్రామానికి చెందిన రైతు సుబ్బురామన్ (75)-లక్ష్మి (65) దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉంది. వారందరికి వివాహమై వేర్వేరుగా నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం లక్ష్మి హఠాత్తుగా గుండెపోటుకు గురికావడంతో ఆమెను వెంటనే తిరువణ్ణామలైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా సాయంత్రం 6 గంటలకు మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి సోమవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేపట్టారు. భార్య మృతితో ఆవేదనతో ఉన్న సుబ్బురామన్ ఉదయం 8 గంటల ప్రాంతంలో హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన కుటుంబసభ్యులు, బంధువులు సాయంత్రం రెండు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానిపై దాడి

● ఇద్దరు రౌడీల అరెస్టు

అడయార్, మే 14: భోజనం చేసి డబ్బులివ్వకుండా వెళ్ళడమేకాకుండా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని, సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు పేరుమోసిన రౌడీలను నగర పోలీసులు అరెస్టు చేశారు. పాత వాషర్‌మెన్‌పేటలోని ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటరులో ఇద్దరు రౌడీలు ఆనంద్, ధరణి సోమవారం రాత్రి భోజనం చేసి డబ్బులు చెల్లించలేదు. పైగా డబ్బులు అడిగినందుకు దుకాణం యజమాని బషీర్ అహ్మద్ (42)తో పాటు ఆ సెంటరులో పనిచేసే సిబ్బందిపై కూడా దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆనంద్, ధరణి అనే ఇద్దరు రౌడీలను అరెస్టు చేశారు.

పూజల పేరుతో మోసం...

నగదు, నగలు దోచుకున్న వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, మే 14: పూజల పేరుతో 9 సవర్ల నగలు, రూ.14 లక్షల నగదు దోచుకున్న వ్యక్తిని ఈరోడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈరోడ్ వీవీసీ నగర్‌కు చెందిన షణ్ముగం, సెల్వి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరికి వివాహమై వేర్వేరుగా ఉంటున్నారు. షణ్ముగం దంపతులు తరచు అనారోగ్యానికి గురికావడంతో ప్రత్యేక పూజలు చేస్తే ఆరోగ్యంగా ఉంటారని పక్కింటి మహిళ సలహా ఇవ్వడంతో వారు పెరుమాళ్ అనే పూజారిని ఆశ్రయించారు. ఆదివారం పూజల కోసం వెళ్లిన పెరుమాళ్ ఇచ్చిన పాలు తాగడంతో వారు కొద్దిసేపటికి స్పృహ కోల్పోయారు. ఇదే అదనుగా భావించిన పెరుమాళ్ బీరువాలోని 9 సవర్ల నగలు, రూ.4 లక్షల నగదుతో పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు ఈరోడ్ కమలానగర్‌కు చెందిన పెరుమాళ్ (60)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచిన అనంతరం జైలుకు తరలించారు.


నీట మునిగి ముగ్గురు బాలుర దుర్మరణం



మృతులు విష్ణు, మారిముత్తు, అశ్విన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మే 14: కరూర్‌లో బావిలో చిక్కుకుని ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన ఘటన గ్రామంలో విషాదానికి దారితీసింది. కరూర్ అండాగకోయిల్ పుదూర్‌కు చెందిన అశ్విన్ (12), విష్ణు (11), మారిముత్తు (11) అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. సోమవారం ఉదయం ఆడుకునేందుకు వెళ్తున్నామని చెప్పిన ఆ ముగ్గురు సాయంత్రం వరకు కూడా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో, రాత్రి 11 గంటల సమయంలో అదే ప్రాంతానికి చెందిన రవిచంద్రన్ తన తోటకు వెళ్లాడు. తోటలోని బావి సమీపంలో మూడు జతల చెప్పులు కనిపించడంతో అనుమానించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చాడు. అగ్నిమాపక అధికారి తిరుమురుగన్ నేతృత్వంలో సిబ్బంది అక్కడకు చేరుకొని గంట సేపు గాలింపు అర్ధరాత్రి 12 గంటలకు మృతదేహాలు వెలికితీశారు. మృతేహాలను పోస్టుమార్టం నిమిత్తం కరూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించిన కరూర్ నగర పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల నుంచి పొగలు



రైలు నుంచి దిగుతున్న ప్రయాణికులు

పెరంబూర్, మే 14: వాణియంబాడి సమీపంలో కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల నుంచి హఠాత్తుగా పొగలు రావడంతో రైలును మధ్యలోనే నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం 20 నిమిషాల ఆలస్యంగా రైలు బయల్దేరింది. న్యూఢిల్లీ నుంచి కేరళ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సోమవారం వాణియంబాడి-విన్నమంగళం రైల్వేస్టేషన్ మధ్య విళయాంబేడు సమీపంలో వస్తుండగా, రిజర్వేషన్ బోగీ (ఎస్ 5) చక్రం వద్ద పొగలు వచ్చాయి. విషయం తెలుసుకున్న డ్రైవర్ మధ్యలోనే రైలు నిలిపి వేశారు. పొగలు చూసిన ప్రయాణికులు బోగీ నుంచి కిందకు దూకేశారు. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టడంతో 20 నిమిషాలు ఆలస్యంగా రైలు బయల్దేరి వెళ్లింది.

స్టోరీ టెల్లింగ్ ఓటీటీ యాప్ 'రేడియో రూమ్'

● ప్రారంభించిన సినీ దిగ్గజాలు

చిత్రజ్యోతి

పలువురు మీడియా, సినీ దిగ్గజాలంతా కలిసి 'రేడియో రూమ్' పేరుతో స్టోరీ టెల్లింగ్ యాప్‌ను ఆవిష్కరించారు. రీజినల్ స్టోరీ టెల్లర్స్ గ్రూపు ప్రెసిడెంట్ ఏఎల్ వెంకటాచలం అలియాస్ వెంకి గురించి మీడియా రంగంలో ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. విజయ్ టెలివిజన్, పుదియుగం టీవీల వ్యవస్థాపకుడు. ఇండిపెండెంట్ నిర్మాత, దర్శకుడు కూడా. ఈయన పలు కార్యక్రమాలను రూపొందించారు. ఈయనకు అపారమైన అనుభవం, పరిపూర్ణ ప్రతిభతో రేడియో రూమ్ అనే కొత్త ఓటీటీ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ రచయిత రాజేష్ కుమార్, దర్శకులు సురేష్ కృష్ణ, శశి, స్టాన్లీ, గౌతం వాసుదేవ్ మేనన్, నటుడు జాన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. రేడియో రూమ్ అనేది కేవలం ఒక ఆడియో బుక్ వంటింది. ఇది ఆకర్షణీయమైన శ్రవణ అనుభవాన్ని అందించే యాప్. ఇందులో పురాణ కథలు, మధ్యయుగ, సమకాలీన రచయితల రచనలు కూడా ప్రత్యేకంగా కంపోజ్ చేసిన సంగీతం, ప్రత్యేక శబ్దాలతో కూడిన ఆడియోగా రూపొందించారు. ప్రస్తుతం తమిళంలోనే కథలను ఆడియోగా రూపొందించారు. త్వరలో తెలుగు, మలయాళం, కన్నడం, మరాఠీ, బెంగాలీతో పాటు స్పానిష్, పోర్చుగీస్, జర్మన్ కథలను కూడా పరిచయం చేయనున్నారు. ఈ యాప్‌లను లైటస్ గ్రూపు వెంచర్, లైటర్ డిజిటల్ సంస్థలు కలిసి రూపొందించాయి.



'రేడియో రూమ్' ప్రారంభోత్సవ దృశ్యం

విజయ్ కనిష్క హీరోగా 'హిట్ లిస్ట్'

విజయ్ కనిష్కను హీరోగా పరిచయం చేస్తూ ప్రముఖ దర్శకుడు కేఎస్ రవికుమార్ తన సొంత నిర్మాణ సంస్థ ఆర్‌కే సెల్యులాయిడ్స్ పతాకంపై నిర్మించిన చిత్రం 'హిట్ లిస్ట్'. శరత్ కుమార్, సముద్రఖని, గౌతం వాసుదేవ్ మేనన్, మునీష్‌కాంత్, కింగ్‌స్లీ, సితార, స్మృతి వెంకట్, రామచంద్ర రాజు, ఐశ్వర్య దత్తా తదితరులు నటించారు. సి.సత్య సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి సూర్యకదిర్ కాక్కల్లర్, కార్తికేయన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ నగరంలో జరిగింది. ఇందులో సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు దేశింగు పెరియస్వామి, పొన్‌రాం, మిత్రన్ ఆర్ జవహర్, కార్తీక్ సుబ్బురాజ్, చిరుత్తై శివ, పేరరసు, శరణ్, ఎళిల్, రాజకుమరన్, సుబ్రమణ్య శివ, వసంత్ బాలన్, మిష్కిన్, ఆర్‌వీ ఉదయకుమార్, పి.వాసు, ఆర్.పార్తిబన్, కె.భాగ్యరాజ్, రమేష్ ఖన్నా, నిర్మాతలు కలైపులి ఎస్.థాను, టి.శివ, సురేష్ కామాక్షి, ధనుంజయన్, హీరోలు జయం రవి, జీవా తదితరులు పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు తెలిపి ఆడియో రిలీజ్ చేశారు. ఇందులో నిర్మాత థాను మాట్లాడుతూ, దర్శకులు విక్రమ్, కేఎస్ రవికుమార్ తెరకెక్కించిన చిత్రాలు నిర్మాతలకు లాభాల పంట పండించాయి. మీరిద్దరు చేసిన పుణ్యఫలం విజయ్ కనిష్కకు వస్తుంది' అన్నారు. కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'ఈ సందర్భంగా సూపర్ గుడ్ ఫిలిమ్స్ అధినేత ఆర్బీ చౌదరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఎంతో మంది దర్శకులను పరిచయం చేసి, చిత్రపరిశ్రమకు ఎంతో సేవతో పాటు మేలు చేశారన్నారు. అలాగే, దర్శకులు విక్రమన్, ఆర్‌వీ ఉదయకుమార్, మిష్కిన్, కార్తీక్ సుబ్బురాజ్, పేరరసు, నిర్మాత సురేష్ కామాక్షి, సుప్రీం స్టార్ శరత్ కుమార్, హీరోలు జీవా, జయంరవి, చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు.



'హిట్ లిస్ట్' ఆడియో రిలీజ్ వేడుక

వివాహబంధానికి స్వస్తి పలికిన జీవీ ప్రకాష్ - సైంధవి

ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ మేనల్లుడు, కోలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాష్ కుమార్ - సినీ నేపథ్యగాయని సైంధవి దంపతులు విడిపోయారు. 11 యేళ్ళ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్టు సోమవారం రాత్రి ప్రకటించారు. ఈ మేరకు వారు సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంతో ఆలోచన చేసి చివరికి విడిపోవాలని నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. 2013లో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఈ జంటకు అన్వీ అనే కుమార్తె ఉంది. తమ విడాకుల అంశంపై జీవీ ప్రకాష్ విడుదల చేసిన ప్రకటనలో 'ఎంతో ఆలోచించి సైంధవి, నేను 11 యేళ్ళ వివాహ బంధానికి వీడ్కోలు చెప్పాలని నిర్ణయించుకున్నాం. మానసిక ప్రశాంతత, ఇద్దరి జీవితాల్లో మెరుగుకోసం ఒకరికొకరం పరస్పర గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ నిర్ణయం ఇద్దరికీ మంచిదని నమ్ముతున్నాం. మా నిర్ణయాన్ని మీడియా మిత్రులు, అభిమానులు అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాం. మా వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, జీవీ ప్రకాష్ ఒక వైపు సంగీత దర్శకుడిగా, మరోవైపు హీరోగా రాణిస్తున్న విషయం తెల్సిందే.


జీవీ ప్రకాష్ కుమార్, సైంధవి

సుప్రీంకోర్టులో గౌండమణికి ఊరట

● రియల్ ఎస్టేట్ కంపెనీ పిటిషన్ కొట్టివేత



సీనియర్ హాస్య నటుడు గౌండమణికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనకు వ్యతిరేకంగా ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసు వివరాలను పరిశీలిస్తే కోడంబాక్కం ఆర్కాడ్ రోడ్డులో 1996 సంవత్సరంలో నిన్నిభాయ్ అనే వ్యక్తికి చెందిన స్థలాన్ని గౌండమణి కొనుగోలు చేసి, ఒక భవన నిర్మాణ కంపెనీకి లీజుకు ఇచ్చారు. అందులో 22,700 చదరపుటడుగుల విస్తీర్ణంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను 15 నెలల్లో నిర్మించేందుకు, ఇందుకోసం రూ.3.58 కోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకోసం 1996 నుంచి 1999 వరకు నిర్మాణ కంపెనీకి రూ.1.04 లక్షలు కూడా చెల్లించారు. కానీ, 2003 వరకు షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆ కంపెనీ నిర్మించలేదు. దీంతో గౌండమణి హైకోర్టుకు వెళ్ళగా, మొత్తం స్థలాన్ని అప్పగించడంతో పాటు 2008 ఆగస్టు నుంచి ప్రతి నెల రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పుపై రియల్ ఎస్టేట్ కంపెనీ సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా, ఈ పిటిషన్‌పై న్యాయమూర్తుల పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం... రియల్ ఎస్టేట్ కంపెనీ పిటిషన్‌ను కొట్టివేసింది.


ధ్వజారోహణం చేస్తున్న పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు

కడలూరు నరసింహస్వామి ఆలయంలో
బ్రహ్మోత్సవాల ప్రారంభం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపం రెడ్డిచావిడి శింగిరిగుడి ప్రాంతంలో సుప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంగా స్వామివారికి తిరుమంజనం నిర్వహించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామిని అలంకరించి ధ్వజస్తంభ మండపం వద్ద వేంచేపుచేశారు. వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ధ్వజారోహణం చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో ప్రతిరోజూ రాత్రి వేళల్లో హంస, సింహ, హనుమంత, శేషవాహనం తదితర వాహనాల్లో స్వామివారిని ఊరేగించనున్నారు. జూన్ ఒకటో తేదీ రాత్రి గరుడ సేవ నిర్వహించనున్నారు. ఈ నెల 21న ఉదయం వెన్నముద్ద కృష్ణుడి అలంకారంలో స్వామివారు ఊరేగనున్నారు. రాత్రి అశ్వవాహనంపై దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 22న జరుగనుంది.

వడలూరులో వైభవంగా జ్యోతిదర్శనం


సత్యజ్ఞానసభ వద్ద జ్యోతిదర్శనం కోసం గుమికూడిన భక్తులు

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వడలూరులోని సత్యజ్ఞాన సభలో ప్రతినెలా పూస నక్షత్ర పర్వదినాన జ్యోతి దర్శనం వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆ మేరకు తమిళ మొదటి మాసమైన చిత్తిరై పూస నక్షత్రమైన సోమవారం రాత్రి 7.45 గంటలకు సత్యజ్ఞాన సభలోని ఆరు తెరలను సభ నిర్వాహకులు వరుసగా తొలగించి భక్తులకు జ్యోతి దర్శనం కల్పించారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జ్యోతి దర్శనం తర్వాత భక్తులందరికీ అన్నదానం చేశారు. అనంతరం వళ్ళలార్ సిద్ధి పొందిన మేట్టుకుప్పం తిరుమాళిగైలోల అర్థరాత్రి 12 గంటలకు ప్రత్యేక ఆరాధన కార్యక్రమం, మౌన ధ్యానం నిర్వహించారు.

వెళ్ళినీర్ జలపాతంలో జలకళ

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో వేసవి ఉష్ణోగ్రత తగ్గిస్తూ వారం రోజులుగా తరచూ వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం ఆహ్లాదకరంగామారింది. ప్రత్యేకించి ఈ వర్షాలకు వెళ్ళినీర్ జలపాతం జలకళను సంతరించుకోవడంతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివెళుతున్నారు. నెల రోజులుగా ఆ జలపాతంలో సన్నటి జలధార మాత్రమే కనిపించేది. ఇటీవల వర్షాలకు ఆ జలపాతంలో నీటి వేగంగా పడుతోంది. దీంతో పర్యాటకులు ఆ జలపాతంలో స్నానం చేస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. ఇదే విధంగా పాంబర్ జలపాతం, ఫ్యూర్ చోళా జలపాతాల వద్ద కూడా నీటి ఉధృతి పెరుగుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఆ ప్రాంతంలోని చెరువులు, వాగులు, జలాశయాల్లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ నెల 17న జరుగనున్న సమ్మర్ ఫెస్టివల్, ఫ్లవర్ షోకు సిద్ధమవుతున్న కొడైకెనాల్ అంతటా ప్రస్తుతం పచ్చదనానికి చల్లదనం కూడా తోడవటంతో పర్యాటకులు సంబరపడిపోతున్నారు. రెండు రోజులుగా కొడైకెనాల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా అధికమైంది.


వెళ్ళినీర్ జలపాతం వద్ద పర్యాటకుల సందడి



ఫ్యాషన్ షోలో యువతులు

ఉత్సాహంగా ఫ్యాషన్ షో

ప్యారీస్, మే 14: నగరంలోని డాట్ స్కూల్ ఆఫ్ డిజైన్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఫ్యాషన్ షోలో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని జీరో వేస్ట్ డిజైన్‌తో తయారుచేసిన దుస్తులు ధరించి మగువలు సందడి చేశారు. చివరగా వీరికి కళాశాల యజమాన్యం జ్ఞాపికలు, బహుమతులు అందజేసి అభినందించింది.

ధోనీని కలుసుకొనేందుకు ఢిల్లీ నుంచి సైకిల్‌పై....!


చేపాక్కం మైదానం వద్ద గుడారం వేసుకున్న గౌరవ్

పెరంబూర్, మే 14: క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనికి దేశవ్యాప్తంగా అభిమానులున్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయినప్పటికీ ఆయన క్రేజ్ తగ్గలేదు. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు. ధోనీని కలుసుకోవాలని, అతని ఆటోగ్రాఫ్‌తో పాటు ఫొటో తీసుకోవాలని అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు. అదే కోరికతో బీహార్‌కు చెందిన గౌరవ్ అనే యువకుడు ఢిల్లీలో ఉంటున్నాడు. అతడు ఢిల్లీ నుంచి సైకిల్‌పై 23 రోజులు ప్రయాణించి చెన్నై చేరుకున్నాడు. చేపాక్కం క్రికెట్ మైదానం సమీపంలో గుడారం వేసుకుని ధోనీతో భేటి కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ నేపథ్యంలో, పోలీసులు అక్కడకు చేరుకుని గౌవర్‌ను విచారించి అతడి కోరిక తెలుసుకొని అభినందించడంతో పాటు నచ్చచెప్పి పంపించారు.


ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామివార్లు

నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేకం

ప్యారీస్, మే 14: స్థానిక పార్క్ టౌన్ ముల్లా వీధిలోని రంగనాథ స్వామి ఆలయంలో రామానుజ అవతార వేడుకల్లో భాగంగా శ్రీరామ పట్టాభిషేకం నేత్రపర్వంగా జరిగింది. ఈ నెల 3 నుంచి మంగళవారం వరకు శ్రీరామానుజ అవతార ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు తిరుమంజనం, పల్లకీ సేవ, ఉత్సవమూర్తులను వివిధ వాహనాల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జె.హరికుమార్ పర్యవేక్షణలో స్వామివార్లకు పట్టాభిషేకం జరిపి అనంతరం ఒంటెద్దు బండిలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శనం చేసుకున్నారు.


ఈ నెల 19వ తేదీ శ్రీలంకలోని సీతమ్మవారి ఆలయ కుంభాభిషేకం జరుగనున్న సందర్భంగా మంగళవారం చెన్నై నుంచి 5 వేల శ్రీవారి లడ్డూలను పంపిస్తున్న టీటీడీ తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల సమాచార కేంద్ర సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు మోహన్‌రావు తదితరులు

గున్న ఏనుగును డివైడర్ దాటించిన తల్లి


తొండంతో గున్న ఏనుగును దాటిస్తున్న తల్లి ఏనుగు

పెరంబూర్, మే 14: నీలగిరి జిల్లా కూడలూరు-కేరళ జాతీయ రహదారిలోని అడవుల నుంచి ఆహారం, నీటి కోసం ఏనుగులు రోడ్డు దాటి వెళ్తుంటాయి. ఈ నేపథ్యంలో, గున్న ఏనుగుతో తల్లి ఏనుగు వెళుతున్న సమయంలో, రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌ను గున్న ఏనుగు దాటలేక పోయింది. ఆ సమయంలో అటు వైపు వచ్చిన వాహనచోదకులు తమ వాహనాలు నిలిపివేశారు. గున్న ఏనుగు డివైడర్ దాటే ప్రయత్నం ఫలించకపోవడంతో, తల్లి ఏనుగు తన తొండంతో గున్న ఏనుగు డివెడర్‌ను దాటించింది. ఈ దృశ్యాలను వాహనచోదకులు తమ సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, వైరల్‌గా మారాయి.

దేశ పురోభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న
ఇంజనీరింగ్ విద్యా సంస్థలు

● ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారామ్

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశ పురోభివృద్ధికి ఇంజనీరింగ్ విద్యా సంస్థలు దోహదపడుతున్నాయని, ఇంజనీరింగ్ కోర్సులకు మళ్ళీ ఆదరణ పెరిగిందని అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అధ్యక్షుడు ప్రొఫెసర్ టీజీ సీతారామ్ అన్నారు. కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఎడ్యుకేషన్ ప్రమోషన్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఈపీఎస్ఐ) ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఉన్నత విద్య : అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ మండలి గుర్తింపు కలిగిన ఇంజనీరింగ్ విద్యా సంస్థల నుంచి ప్రతియేటా 1.4మిలియన్ల విద్యార్థులు పట్టా పొందుతున్నారని తెలిపారు. ఆ యువ ఇంజనీరింగ్ పట్టభద్రులే దేశపురోగతికి పట్టుగొమ్మలన్నారు. ఎస్ఆర్ఎం ప్రొ ఛాన్సలర్ డాక్టర్ పి. సత్యనారాయణ, మద్రాసు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్పీ త్యాగరాజన్, బెంగళూరులోని రామయ్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ ఎంఆర్ జయరామ్, యూజీసీ మాజీ చైర్మన్ డీపీ సింగ్, ఈపీఎస్ఐ సెక్రటరీ జనరల్ పి.పళనివేల్ తదితరులు పాల్గొన్నారు.



ఈపీఎస్ఐ చర్చావేదికలో పాల్గొన్న ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్, ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొ ఛాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణ తదితరులు

వీఓసీ పార్క్‌ నుంచి అడవిలోకి జింకలు

పెరంబూర్, మే 14: కోయంబత్తూర్ వీవోసీ పార్క్‌లో సంరక్షిస్తున్న 26 జింకలను అడవిలోకి వదిలిపెట్టారు. కోవై వీఓసీ జూలాజికల్ పార్క్ గుర్తింపును 2022లో రద్దు చేశారు. ఈ పార్క్‌లో సంరక్షిస్తున్న జంతువులను వేరే ప్రాంతాలకు తరలించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ గత ఏడాది ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, ఒక్కో రకమైన జంతువులను అటవీ ప్రాంతాల్లో వదిలిపెడుతున్నారు. పార్క్‌లో జింకలకు అవసరమైన మేత కూడా నిలిపివేయడంతో, సిరువాణి కొండల దిగువ ప్రాంతాల్లో వెళ్లి జింకలు మేత తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం 26 జింకలను కంటైనర్ లో ఎక్కించి బిల్లర్ హౌస్ అటవీ రేంజ్ ప్రాంతంలో వాటిని వదిలిపెట్టారు. ఈ జింకలకు మేత, నీరు అందుతుందా, అవి ఆరోగ్యంగా ఉన్నాయా అని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.


జింకలను అడవిలోకి వదులుతున్న అటవీ శాఖ సిబ్బంది